

గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు

# అభివృద్ధి మెరువంగ.. మల్లారెడ్డిగూడ మురువంగ..

- పల్లె ప్రగతి పనులతో మారిన రూపురేఖలు
- సీసీ రోడ్లు, వీధి లైట్లతో జిగేల్ మంటున్న వీధులు
- ఏపుగా పెరిగిన హరితహారం మొక్కలు
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు

చేవెళ్ల రూరల్, అక్టోబర్ 7: పట్టణాలకు దీటుగా అభివృద్ధిలో దూసుకుపోతున్నాయి మండలంలోని పలు గ్రామాలు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో మండలంలోని మల్లారెడ్డిగూడ, దాని అనుబంధ గ్రామం ఎర్రోనికొటాల ప్రగతిపథంలో ముందున్నాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన పల్లెప్రగతి కార్యక్రమంతో ఈ గ్రామాల రూపురేఖలు ఎంతో మారాయి. అన్ని వీధుల్లోనూ సీసీ రోడ్లు, వీధి లైట్లతో జిగేల్ మంటున్నాయి. హరితహారంలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగి ఆ దారుల్లో రాకపోకలు సాగించే వారిని ఆకట్టుకుంటున్నాయి. ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులతో సమస్యలను సర్పంచ్, వార్డు సభ్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తున్నారు. అంతేకాకుండా పెండింగ్ అపరిష్కృత సమస్యలకు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. గ్రామంలో జనాభా 656 ఉండగా.. ఓటర్లు 635 మంది ఉన్నారు. సర్పంచ్ మల్గారి మోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శిగా బాల్‌రాజ్ విధులు నిర్వహిస్తున్నారు. రూ.10 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, రూ.27 లక్షలతో సీసీ రోడ్లు, వీధి దీపాలు, సీసీ కెమెరాల ఏర్పాటు, ట్రాక్టర్, ట్రాలీ, వైకుంఠధామం, మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు, డంపింగ్‌యార్డు, నర్సరీ, రూ.20 లక్షలతో నూతన గ్రామ పంచాయతీ భవనం, రూ.8.5 లక్షలతో డ్వాక్రా, రూ.6 లక్షలతో అంగన్‌వాడీ భవనాలను నిర్మించారు. సర్పంచ్ మోహన్‌రెడ్డి రూ.10 లక్షల సొంత నిధులతో రెండు గ్రామాల్లోనూ పలు అభివృద్ధి పనులు చేపట్టారు. వైకుంఠధామాల ఏర్పాటుతో ఈ రెండు గ్రామాల్లోనూ అంతిమ యాత్రకు ఇబ్బందులు తొలగాయి. పారిశుద్ధ్య నిర్వహణకు సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి అధిక ప్రాధాన్యమిస్తున్నారు. ప్రతిరోజూ పంచాయతీ సిబ్బంది గ్రామాల్లోని అన్ని వీధులను శుభ్రం చేస్తున్నారు. సేకరించిన చెత్తాచెదారాన్ని పల్లెప్రగతి నిధులతో కొనుగోలు చేసిన ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డుకు తరలించి.. అక్కడ ఆ చెత్తతో సేంద్రియ ఎరువును తయారు చేస్తున్నారు. దానిని హరితహారంలో నాటిన మొక్కలకు వినియోగిస్తున్నారు. ప్రధాన దారులకు ఇరువైపులా.. గ్రామ పరిసరాలు, పల్లె ప్రకృతివనంలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగి చూపరులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. మొక్కల సంరక్షణకు పంచాయతీ సిబ్బంది, వన సంరక్షకులు చర్యలు తీసుకుంటున్నారు. రెండు గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధిని చూసి స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే ఎంతో కృషి చేస్తున్నారు



సీఎం కేసీఆర్ చలువతోనే మా గ్రామం ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటైంది. గతంలో కందవాడకు అనుబంధ గ్రామంగా ఉండేది. ప్రస్తుతం పంచాయతీగా ఏర్పాటు కావడంతో ప్రభుత్వం మంజూరు చేసిన లక్షలాది రూపాయలతో అనేక అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేశా. గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే కాలె యాదయ్య చొరువ మరువలేనిది. ఆయన అధికంగా నిధులను మంజూరు చేశారు. గ్రామస్తుల తరఫున ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు.

- మల్గారి మోహన్‌రెడ్డి, మల్లారెడ్డి గూడ సర్పంచ్

## ఏండ్ల నాటి సమస్యలు పరిష్కారం



సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పల్లెప్రగతి కార్యక్రమంతో గ్రామాల రూపురేఖలు మారాయి. ఏండ్ల నాటి సమస్యలకు మా గ్రామంలో శాశ్వత పరిష్కారం లభించింది. పచ్చదనం, పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యమిస్తున్నాం. ఇంటింటికీ శుద్ధి చేసిన తాగునీరు అందుతున్నది. ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం.

- పడమటి రాధిక, ఉప సర్పంచ్, మల్లారెడ్డి గూడ

పల్లె ప్రకృతి వనంలో ఏపుగా పెరిగిన మొక్కలు







భగీరథ మంచినీటి ట్యాంకు

## గ్రీనరీ పెంపు.. పారిశుద్ధ్యంపై శ్రద్ధ..



హరితహారం కార్యక్రమంలో లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు నాటాం. నాటిన మొక్కలు ఏపుగా పెరిగి నేడు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. మొక్కల పెంపు, పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. స్థానికులు తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులకు ఇచ్చేలా ఇప్పటికే అవగాహన కల్పించాం. దీంతో గ్రామాలు అందంగా ఉంటున్నాయి.

- బాల్‌రాజ్, పంచాయతీ కార్యదర్శి, మల్లారెడ్డిగూడ గ్రామం



ప్రధాన రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన హరితహారంలో నాటిన మొక్కలు

# మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

## అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

- మారుతున్న బడంగ్‌పేట, మీర్‌పేట కార్పొరేషన్ల రూపురేఖలు
- విద్యాశాఖ మంత్రి పి సబితాఇంద్రారెడ్డి
- మహేశ్వరం నియోజక వర్గంలో సుడిగాలి పర్యటన
- ఒకే రోజు రూ.75కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు



బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ నూతన భవన శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, అక్టోబర్ 7: కోట్లాది రూపాయలతో బడంగ్‌పేట, మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ల రూపురేఖలను మార్చుతున్నట్లు విద్యాశాఖ మంత్రి పి సబితాఇంద్రారెడ్డి అన్నారు. శనివారం ఆమె సుడిగాలి పర్యటన చేసి బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఒకే రోజు రూ.75 కోట్ల నిధులతో చేపట్టనున్న, నిర్మాణం పూర్తైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. 16, 17, 18, 19, 21, 31 డివిజన్లలో రూ.3.19 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, రూ.9.2 కోట్లతో నిర్మించిన బడంగ్‌పేట నూతన మున్సిపల్ కార్పొరేషన్ భవన ప్రారంభం.. అదేవిధంగా రూ.4.25 కోట్లతో ప్రజాభవనం, రూ.2.40 కోట్లతో కుర్మల్‌గూడలో 24 కుల సంఘాల భవనాలకు, రూ.4.72 కోట్లతో కుర్మల్‌గూడలో డీఆర్‌సీ సెంటర్, నాదర్‌గుల్‌లో దోబీఘాట్ తదితర అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనకు అధిక నిధులను వెచ్చిస్తున్నట్లు తెలిపారు. గత ఉమ్మడి ప్రభుత్వాల పాలనలో కుల వృత్తులను అప్పటి పాలకులు నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. సీఎం కేసీఆర్ కుల వృత్తులకు పూర్వవైభవం తీసుకొచ్చారని, మహేశ్వరం నియోజకవర్గంలోని అన్ని కుల సంఘాలకు ఆత్మగౌరవ భవనాలను రూ.2.40 కోట్లతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారించిందని..కులమతాలకతీతంగా పనిచేస్తున్నదన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. చెరువుల సుందరీకరణ, నాలాల అభివృద్ధితోపాటు రోడ్ల విస్తరణ, అర్బన్ పార్కుల ఏర్పాటు, పేదలకు మెరుగైన వైద్యంకోసం బస్తీ దవాఖానలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా త్వరలోనే సూపర్ స్పెషాలిటీ దవాఖానలను ఏర్పాటు చేస్తామన్నారు. నియోజకవర్గానికి మెడికల్ కళాశాలనూ తీసుకొచ్చినట్లు గుర్తు చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు పనిచేస్తున్నామని.. అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న సీఎం కేసీఆర్‌ను రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల అమలు కాని హామీలను నమ్మొద్దని ప్రజలకు సూచించారు. రాష్ట్రాభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమన్నారు. ఆయా కార్యక్రమాల్లో బడంగ్‌పేట మేయర్ పారిజాతానర్సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కమిషనర్ సుమన్‌రావు, కార్పొరేటర్ అర్జున్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

# డిజిటలైజేషన్‌తో ఆరోగ్యం మెరుగు

## ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న జయేశ్‌రంజన్

సుల్తాన్‌బజార్, అక్టోబర్ 7: వైద్య రంగంలో ప్రజారోగ్యాన్ని మెరుగుపర్చేందుకు డిజిటలైజేషన్ ప్రక్రియ ఎంతగానో దోహదం చేస్తుందని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్ పేర్కొన్నారు. కోఠిలోని ఉస్మానియా మెడికల్ కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న వర్క్‌షాపునకు శనివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. వైద్యారోగ్య రంగంలో డిజిటలైజేషన్ ప్రక్రియతో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని, దీనిని వినియోగించడంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ముందు వరుసలో ఉందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళారెడ్డి మాట్లాడుతూ ప్రజారోగ్యంలో డ్రోన్ టెక్నాలజీ, నవజాత శిశువుల ఆరోగ్య పరిరక్షణ, ఆయుష్మాన్ భారత్ ఆధునిక యంత్రాల ద్వారా ఆరోగ్య పరిరక్షణ డిజిటలైజేషన్‌తోనే సాధ్యమవుతుందన్నారు. ఈ ప్రక్రియతో వ్యాధులను ముందే గుర్తించడం, టెలి మెడిసిన్ వంటి ఈ-సేవలను ఇప్పటికే రాష్ట్రంలో అందిస్తున్నట్లు తెలిపారు. ఈ వర్క్‌షాప్‌లో తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల నుంచి సుమారు 400 మంది ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, పీజీ వైద్య విద్యార్థులు పాల్గొని రిసెర్చ్ పేపర్స్ ప్రజెంటేషన్ చేశారు. కార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసన్ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ డాక్టర్ భవాని, ప్రొఫెసర్ డాక్టర్ కిరణ్మయి, అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ అహ్మద్, కిరణ్మయి, ఉమారాణి, అనుపమ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ ఆనంద్, మిషా, శ్రీలత, విజయ శ్రీ, మారుతిరెడ్డి, ఎంపీహెచ్‌వో వేణుగోపాల్ గౌడ్ పాల్గొన్నారు.

## ఆకట్టుకునే నగలు.. ఆకర్షించే డిజైన్లు

### 9వ తేదీ వరకు హై లైఫ్ బ్రైడ్స్ ఎక్స్ పో

మహిళలు ఎంతో మెచ్చే సరికొత్త డిజైన్‌లతో కూడిన బంగారు ఆభరణాలు మాదాపూర్‌లోని హెచ్‌ఐసీసీలో కొలువుదీరాయి. నటీమణులు వర్ష, అర్చనారవి, ఐశ్వర్య, మిస్ ఇండియా, ఏపీ 2022 లికిత యెలమంచిలి తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రముఖ మోడళ్లు, నిర్వాహకుడు అభి డోమినిక్‌తో కలిసి శనివారం హైలైఫ్ బ్రైడ్ ఎక్స్‌ను జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ కార్యక్రమం ఈ నెల 9 వరకు కొనసాగుతుందన్నారు.

మాదాపూర్, అక్టోబర్ 7:





# అల్లరి

ALLARI

టంగ్ ట్విస్టర్



Double bubble gum, bubbles double.






సీహెచ్ అఖిల్, నల్గొండ.

చిటర్ హ్యాండ్స్

కథ

# అసలైన కథ!


... మొర్రి గోపి



''తాతయ్యా! నేను ఓ కథ రాశాను. చదివి ఎలా ఉందో చెప్పు!'' అంటూ తన రచనను హనుమంత రావు చేతికి ఇచ్చాడు రాహుల్. మనవడు రాసిన కథను చదివి, రాహుల్ వైపు ఒకసారి ప్రశ్నార్థకంగా చూశాడు హనుమంత రావు. ''ఎలా ఉంది?'' అని అడిగాడు రాహుల్.

''ఒరేయ్! కథలో నాయకుడు ఉండాలి కదా! నువ్వు అడ్డదారుల్లో జీవించే ప్రతి నాయకుణ్ని నాయకుడిగా చెలామణి చేశావు. చెడు పనులు చేసేవాడు ఎప్పుడూ నాయకుడు కాలేడు. కథ కూడా మంచినే ఉద్బోధించాలి. కానీ, నీ కథలో నువ్వు నాయకుడిగా అనుకున్న పాత్ర.. అంతా అడ్డదారుల్లోనే ప్రయాణించింది. నువ్వు ఈ కథ ద్వారా.. చెడు మార్గంలో ప్రయాణిస్తే ప్రయోజకులు అవుతారని పాఠకులకు చెప్పదలుచుకున్నావా?'' అని అడిగాడు. ''అలా అంటావేంటి తాతయ్య! ఈమధ్య నేను చూసిన సినిమాల్లో సకల వ్యసనాలు ఉన్నవాళ్లనే హీరోలుగా చూపిస్తున్నారు. అడ్డదారుల్లో అందలం ఎక్కేవారే హీరోలు. అలాంటి సినిమాలకే ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతున్నారు'' అంటూ వివరణ ఇచ్చాడు రాహుల్. ఆ మాటలకు ఆయన నవ్వి.. ''కథా రచయితగా నువ్వు ఎప్పుడూ సమాజం మేలుకోరాలి. నువ్వు రాసే కథ ద్వారా చదివిన వారిలో మార్పు రావాలి. నలుగురికీ మేలు చేయకపోయినా ఫర్వాలేదు గానీ, అడ్డదారుల్లో వెళ్లేవారిని హీరోలుగా చిత్రీకరించి, సమాజానికి కీడు కలిగించడం మాత్రం తప్పు!'' అంటూ హితవు చెప్పాడు. పదో తరగతి చదువుతున్న రాహుల్ మీద సినిమాల ప్రభావం ఎక్కువ. అందుకే అలా రాశాడు. తాతయ్య మాటలతో.. సమాజాన్ని మంచివైపు నడిపించేదే అసలైన సాహిత్యం.. అని గ్రహించాడు.

తేడాలు కనిపెట్టండి



ఒకేలా కనిపిస్తున్న ఈ రెండు చిత్రాల్లో 10 తేడాలున్నాయి. అవేంటో కనిపెట్టండి.

పెద్దల మాట



ఉత్తమ సాహిత్యం సమ్యక్ జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది. కాలక్షేప సాహిత్యం ఆలోచనల్ని పక్కదారి పట్టిస్తుంది.

- చాణక్యుడు

తెలుసుకుందాం

1. దేశంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు?
   - స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
2. ప్రపంచంలో లోతైన సరస్సు?
   - లేక్ బైకాల్ (సైబీరియా)
3. యాలకులు మొక్కలోని ఏ భాగం నుంచి వస్తాయి?
   - ఫలం

పూరించండి



_up



_rab

బొమ్మల ఆధారంగా ఖాళీలను పూరించండి.

పదసృష్టి



కింది పదంలోని అక్షరాల సాయంతో ఎన్ని కొత్త పదాలను సృష్టించగలరో చూడండి.

**Healthy**

Ex : Heal

జవాబులు : పూరించండి : CUP, CRAB

పిల్లలూ! మీరు గీసిన బొమ్మలు, రాసిన కథలు, జోక్స్ మాకు పంపండి. బాగుంటే ప్రచురిస్తాం. మా చిరునామా : zindagi@ntnews.com